సాక్షి
కాకినాడ

శుక్రవారం । 5 । జూలై । 2024



రూ.50,116 విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి బి.వెంకట శ్రీకోటిరత్నం దంపతులు (గుంటూరు) రూ.50,116 విరాళం అందించారు.



ప్రతిభ చూపితే.. భవిత మీదే..

పరిశోధన, ప్రయోగాల్లో విద్యార్థులు రాణించేలా కేంద్ర ప్రభుత్వం ఏటా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరిట జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. - 8లో

డెల్టాలకు 12,920 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 12,920 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు 4 వేలు, సెంట్రల్ 2,420 పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. సముద్రంలోకి 28,283 క్యూసెక్కుల మిగులు జలాలు విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి బారులు తీరిన భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి గురువారం కిటకిటలాడింది. సుమారు 25 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 3 వేల మంది భక్తులు స్వీకరించారు.

నేడు ప్రత్యంగిర హోమం

రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి జ్యేష్ఠ మాస అమావాస్య సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. భక్తులు రూ.750 టికెట్టుతో ఈ హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

సహకార సంఘాలు బలోపేతం కావాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ కో ఆపరేటివ్ ట్రైనింగ్ నోడల్ అధికారి ఎస్ఏఎల్ఎన్‌టీ శ్రీనివాస్ అన్నారు. డిజిటల్ సేవల ద్వారా ఆర్థిక వనరుల సమీకరణపై సహకార సంఘాల సీఈఓలకు స్థానిక డీసీసీబీలో గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చి, సభ్యులకు సేవలందించాలని అన్నారు. కామన్ సర్వీస్ పోర్టల్‌తో ప్రభుత్వ, బ్యాంకింగ్, బీమా తదితర రంగాలకు సంబంధించి ఆన్‌లైన్ సేవలు అందించడం ద్వారా సంఘాలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని వివరించారు. సంఘ సభ్యులకు విభిన్న సేవలు సకాలంలో అందించవచ్చన్నారు. ఈ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 32, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 174 సేవలు అందుబాటులో రానున్నాయని చెప్పారు. సహకార సంఘాల్లోని కార్యనిర్వహణ అధికారులకు అవగాహన, నైపుణ్యం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర సహకార శాఖలు, రాష్ట్ర సహకార బ్యాంకు ఈ శిక్షణ ఇస్తున్నాయని శ్రీనివాస్ తెలిపారు. జిల్లా సహకార శాఖాధికారి వెంకట కృష్ణ మాట్లాడుతూ, ఈ పోర్టల్‌లో సహకార సంఘాల సీఈఓలు నైపుణ్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు, జీఎం ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేసే అన్ని కేటగిరీల టీచర్లు, హెచ్ఎంలు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 15వ తేదీ వరకూ ప్రతిపాదనలు సమర్పించాలని వాసుదేవరావు పేర్కొన్నారు.

అన్నదాతపై తొలిదెబ్బ!

- ఉచిత పంటల బీమాకు ఉద్వాసన!
- ఈ పథకంలో రైతు భాగస్వామ్యం ఉండాలన్న సీఎం
- పాత రోజులు పునరావృతమవుతాయని రైతుల ఆందోళన
- వైఎస్సార్ సీపీ హయాంలో ఉచిత పంటల బీమా అమలు
- నేడు రైతుల పైనే ప్రీమియం భారం
- ఉచిత బీమా కొనసాగించాలని డిమాండ్





సాక్షి ప్రతినిధి, కాకినాడ: అనుకున్నట్టే అవుతోంది. అన్నదాతలపై చంద్రబాబు సర్కార్ తొలి దెబ్బ వేయడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సమయంలో సాగు పెట్టుబడులకు రైతులకు డబ్బులు ఇబ్బడిముబ్బడిగా అవసరమవుతాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాతా సుఖీభవ' పథకం ద్వారా ఇస్తానన్న రూ.20 వేలు రైతున్నలకు ఇంతవరకూ ఇవ్వకపోగా.. తాజాగా ఉచిత పంటల బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) పథకానికి ఉద్వాసన పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. 'రైతు భాగస్వామ్యం లేకుండా పంటల బీమా స్వరూపాన్నే మార్చేశారు. ఇక నుంచి సాగు చేసే ప్రతి రైతుకూ భాగస్వామ్యం ఉండే విధానాన్ని పునరుద్ధరించాలి' అని సీఎం చంద్రబాబు రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి, రైతులపై భారం మోపే దిశగా టీడీపీ - జనసేన - బీజేపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని అర్థమవుతోంది. దీనికి సంబంధించిన విధివిధానాలు ఇప్పటికిప్పుడు రాకున్నా రైతుల్లో మాత్రం ఒక రకమైన ఆందోళన మొదలైంది. చంద్రబాబు ప్రకటన వెనుక ఉద్దేశం ఏదైనప్పటికీ పంటల బీమా కోసం రైతులు కచ్చితంగా ప్రీమియం చెల్లించాల్సిన పాత రోజులు పునరావృతం కావడం ఖాయమనే సంకేతాలే అందుతున్నాయి.

పంటల బీమా పథకం రైతులకు పెద్ద భరోసా. ఒకప్పుడు నూటికి ఆరేడుగురు రైతులకు.. అది కూడా **అడపదడపా బీమా పరిహారం వస్తేనే పల్లెల్లో రైతులు ఎంతో గొప్పగా చెప్పుకునే వారు. అసలు పంటల బీమా అంటూ ఒకటుందని మోతుబరి రైతులకు మినహా చాలా మందికి పెద్దగా అవగాహన ఉండేది కాదు. అది కూడా రైతులే ప్రీమియం చెల్లించాల్సి వచ్చేది.**

జగన్ సర్కార్‌లో ఉచితం

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆయన ప్రభుత్వం పూర్తి స్థాయిలో రైతు సానుకూల విధానాలు అవలంబించింది. మొదట్లో రైతు కేవలం రూపాయి ప్రీమియం చెల్లిస్తే చాలు.. పంటల బీమా వర్తింపజేసేవారు. అనంతరం దీనిని కూడా సవరించి, **పైసా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు చేశారు. తద్వారా రైతుపై ప్రీమియం భారాన్ని పూర్తిగా తగ్గించారు. అప్పటి వరకూ రైతులకే పరిమితమైన ఈ పంటల బీమాను కౌలు రైతులకు, తరువాత దేవదాయ భూములు** కౌలుకు చేసే రైతులకు కూడా నాటి జగన్ ప్రభుత్వం వర్తింపజేసింది. తద్వారా కౌలు రైతులకు కూడా ఎంతో మేలు చేసింది. కౌలు రైతులతో సమానంగా దేవదాయ భూములు సాగు చేసే కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులు ఇవ్వడం, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులందరికీ ఈ–క్రాప్, ఈ–కేవైసీ నమోదు తప్పనిసరి చేయడంతో ఇది సాధ్యమైంది. రైతుల పక్షాన పంటల బీమా ప్రీమియాన్ని నాడు జగన్ ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లిస్తూ వచ్చింది. ఫలితంగా రైతులు పైసా చెల్లించనవసరం లేకుండానే వరదలు, తుపాన్లు, అధిక వర్షాల వంటి విపత్తులు సంభవించి, పంటలు నష్టపోతే బీమా పరిహారం లభించేది. ఇది వారికి ఎంతో ఊరటగా ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాక ముందు పంట నష్టానికి రైతులు అంత వేగంగా పరిహారం అందుకున్న దాఖలాలు లేనే లేవు. ఏదైనా సీజన్‌లో పంట నష్టపోతే ఆ సీజన్ దాటకుండానే బీమా సొమ్ము రైతు చేతికి అందేలా జగన్ ప్రభుత్వం పక్కా చర్యలు తీసుకుంది. ఫలితంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా గడచిన ఐదేళ్లలో ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులు రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్లు పైగా పరిహారాన్ని అందుకున్నారు. అంతే కాదు, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేసి ఆదుకుంది.

ఉచితానికి మంగళం!

సాగు చేస్తున్న ప్రతి రైతుకూ లబ్ధి చేకూరుస్తున్న ఉచిత పంటల బీమా పథకానికి మార్పుల పేరుతో మంగళం పాడేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటువంటి ఆలోచన ఉండబట్టే రైతుల భాగస్వామ్యంతో పాత పద్ధతిలోనే పంటల బీమా అని ఆయన మనసులో మాట బయట పెట్టారని రైతు ప్రతినిధులు అంటున్నారు. ఉచిత పంటల బీమాలో మార్పులు చేస్తే రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ పనుల్లో నిండా తలమునకలయ్యే రైతులు సకాలంలో ప్రీమియం జమ చేయలేక బీమా పరిహారం అందుకోలేకపోతున్నారనే ఉద్దేశంతో ఉచిత పంటల బీమా అమలు చేశారని అంటున్నారు. అంతటి దూరదృష్టితో తీసుకువచ్చిన ఉచిత పంటల బీమా పథకంలో ఎటువంటి మార్పులూ సమర్థనీయం కాదని స్పష్టం చేస్తున్నారు.

గతంలో..

మొదట్లో పంటల బీమా పొందాలంటే రైతులు నూటికి రూపాయి ప్రీమియం చెల్లించే వారు. ఆ సమయంలో రూ.10 వేల రుణానికి రూ.100 ప్రీమియం ఉండగా క్రమంగా అది రూ.200కు పెరిగింది. అది కూడా పంట రుణంతో పాటే వసూలు చేసేవారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పేరిట ప్రభుత్వమే ఆ రూ.200 జమ చేసేది. అప్పట్లో రుణం తీసుకున్న రైతులకు మాత్రమే ఈ బీమా వర్తించేది. తర్వాత వాణిజ్య బ్యాంకులు నిబంధనలు సడలించి, రుణం తీసుకోని రైతులకు కూడా వారి అభీష్టం మేరకు ఎకరాకు రూ.600 ప్రీమియం జమ చేస్తే పంటల బీమా అమలు చేసేవి. రైతులు పంట రుణాలు తీసుకున్నప్పుడు ఆ రుణంతోపాటు ప్రీమియం సొమ్ము కూడా సంబంధిత బ్యాంకులు వసూలు చేసేవి. అప్పట్లో పంటల బీమాను మండలం యూనిట్‌గా అమలు చేసేవారు. ఆ మండలంలో సాగు చేసిన పంటలన్నింటికీ ప్రకృతి విపత్తులతో నష్టం వాటిల్లితే, నష్ట తీవ్రతను బట్టి బీమా ఇచ్చేవారు. తర్వాత గ్రామం యూనిట్‌గా అమలు చేయడంతో వాణిజ్య బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పంటరుణం తీసుకున్న వారికే రుణాన్ని బట్టి బీమా శాతాన్ని లెక్క కట్టేవారు. రైతులు బ్యాంకులు, సొసైటీల్లో రుణం తీసుకోకపోతే పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయినా రూపాయి బీమా కూడా వచ్చేది కాదు.

కాకినాడ జిల్లాలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా

సంవత్సరం	మొత్తం రైతులు	లబ్ధి (రూ.లక్షల్లో)
2019–20	6,536	1,308.81
2020–21	59,787	11,321.31
2021–22	52,659	15,804.67
2022–23	16,371	1,204.00
2023–24	0	0
మొత్తం	1,35,353	29,638.79

పాత పద్ధతే కొనసాగించాలి



పంటలకు ఇప్పటి వరకూ ఉన్న ఇన్సూరెన్స్ పద్ధతినే ప్రభుత్వం కొనసాగించాలి. దీని వలన రైతులకు మేలు జరుగుతుంది. గతంలో మాదిరిగా రైతులతో సొమ్ము చెల్లించాలనే విధానాన్ని చంద్రబాబు నాయుడు కొత్తగా పెట్టడం సరికాదు.

– కొవ్వూరు శ్రీను, రైతు, ఖండవల్లి, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా

రైతులు నష్టపోతారు



పంటల బీమా అమలులో పాత పద్ధతినే కొనసాగిస్తామంటూ సీఎం చంద్రబాబు చెప్పడంతో చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పంటల బీమాను ముందుగా ప్రీమియం చెల్లించిన రైతులకు మాత్రమే చెల్లించేవారు. కౌలు రైతుకు అందేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు, కౌలు రైతు అనే తేడా లేకుండా ఈ–క్రాప్ చేయించుకున్న ప్రతి ఒక్కరికీ పంట నష్టాన్ని బట్టి బీమా వర్తించేది. దీంతో రైతులు పంట పంటకు నష్టం జరుగుతుందనే ఆలోచన లేకుండా ధైర్యంగా సాగు చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త నిర్ణయాలను అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తే రైతులు కచ్చితంగా నష్టపోతారు. రైతులకు నష్టం లేకుండా నిర్ణయం తీసుకోవాలి.

– జిన్నూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం కోనసీమ జిల్లా అధ్యక్షుడు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

జింబాబ్వే విద్యార్థినులకు డయేరియా

కాకినాడ/అన్నవరం: నగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న జింబాబ్వే దేశానికి చెందిన ఏడుగురు విద్యార్థినులు డయేరియా బారిన పడ్డారు. వారిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జింబాబ్వే నుంచి ఇక్కడకు వచ్చి డిగ్రీ చదువుతున్న వీరు బుధవారం అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. కళాశాల యాజమాన్యం వారిని వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. విషయం తెలిసిన వెంటనే నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశాల మేరకు కార్పొరేషన్ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, ఆహార తనిఖీ అధికారులు విద్యార్థినుల హాస్టల్‌ను సందర్శించారు. అక్కడ పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అక్కడ ఎటువంటి లోపాలూ కనిపించలేదని స్పష్టం చేశారు. ఈ ఏడుగురు విద్యార్థినులకు మాత్రమే డయేరియా రావడంపై వారు బయటకు వెళ్లి ఎక్కడైనా ఆహారం తిన్నారేమో ఆరా తీస్తున్నారు. బాధిత విద్యార్థినులను కమిషనర్ వెంకటరావు గురువారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడారు. వారికి ఎటువంటి ఇబ్బందీ లేదని, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. డయేరియాకు కారణాలను పరిశీలిస్తున్నామన్నారు. ఎక్కడైనా డయేరియా లక్షణాలు కనిపిస్తే నగరపాలక సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు కాల్ చేయాలని సూచించారు. ఇది 24 గంటలూ పని చేస్తుందన్నారు.



కాకినాడ ఆస్పత్రిలో జింబాబ్వే విద్యార్థినులను పరామర్శిస్తున్న కమిషనర్ వెంకటరావు



అన్నవరంలో ఆగమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వైద్యాధికారులు

కోలుకుంటున్న ఆగమ పాఠశాల విద్యార్థులు

అన్నవరం దేవస్థానంలో డయేరియా బారిన పడిన సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు కోలుకుంటున్నారు. ఇక్కడ చదువుతున్న 36 మంది విద్యార్థుల్లో ఎనిమిది మందికి బుధవారం డయేరియా సోకిన విషయం తెలిసిందే. వారిని సత్యగిరిపై ఉన్న పాఠశాల నుంచి దగ్గరలోని శివసదన్ సత్రంలోని ఏసీ గదులకు తరలించి, చికిత్స అందిస్తున్నారు. వారు కోలుకుంటున్నారని, అవసరమైన మందులు ఇస్తున్నామని దేవస్థానం వైద్యాధికారి శ్రీకాంత్ గురువారం తెలిపారు. బాధిత విద్యార్థులను డిప్యూటీ డీఎంహెచ్ఓ సరిత పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి, తగిన చికిత్స అందించేందుకు అంటురోగాల నిరోధక విభాగం వైద్యులు రుక్మిణిని కలెక్టర్ నియమించారు. విద్యార్థులు పూర్తి స్థాయిలో కోలుకునేంత వరకూ ఆమె తన బృందంతో రత్నగిరిపై బస చేసి, చికిత్సను పర్యవేక్షించాలని ఆదేశించారు. సత్యగిరిపై హరిహర సదన్, విష్ణు సదన్ సత్రాలతో పాటు ఆగమ పాఠశాలకు నీటి సరఫరా చేసేందుకు 1.50 లక్షలు, 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకులున్నాయి. విద్యార్థులు డయేరియా బారిన పడిన నేపథ్యంలో ఈ ట్యాంకులను శుభ్రం చేశామని దేవస్థానం వాటర్ వర్క్స్ ఏఈఈ గురయ్య తెలిపారు. వాటర్ ట్యాంకుల క్లీనింగ్ నేపథ్యంలో సత్యగిరిపై సత్రాల్లోని గదులను భక్తులకు అద్దెకు ఇవ్వలేదు. రత్నగిరిపై సబ్ క్యాంటీన్ పక్కన ఉన్న వాటర్ ట్యాంకులను కూడా కడిగించనున్నామని ఆయన తెలిపారు.

నాడు–నేడు పనులు వేగంగా పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ షాన్ మోహన్, అధికారులు

- కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశం
- అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: జిల్లాలో మన బడి నాడు–నేడులో భాగంగా రెండో దశలో చేపట్టిన మరుగుదొడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాడు–నేడు రెండో దశ కింద ఇంకా 123 పాఠశాలల్లో మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ పనులను ఈ నెల 13 నాటికి పూర్తి చేసి, ఎంఈఓలు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు కలిపి సుమారు 2.75 లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రతి విద్యార్థికి ఒక స్కూల్ బ్యాగ్, ఒక జత షూ, సాక్స్, రెండు జతల యూనిఫాం, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు కలిపి ఒక కిట్‌గా అందజేస్తామని చెప్పారు. డ్రాపౌట్ అయిన వారిని గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని అన్నారు. కేజీబీవీలతో పాటు సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, జిల్లా సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ అధికారులు డీవీ రమణమూర్తి, ఎం.లల్లి, ఎం.విజయశాంతి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి

ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధనతో పాటు ఉత్తమ ఉపాధులకు దోహదం చేసే నైపుణ్య శిక్షణను విద్యార్థులకు అందించాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ, సాంకేతిక కళాశాలల్లో బోధన, సదుపాయాలు, సమస్యలపై ఆయా అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశానికి, రాష్ట్రానికి మంచి నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేలా ఉన్నత విద్యాబోధన ఉండాలని సూచించారు. యువతకు మెరుగైన, విస్తృత ఉపాధి అవకాశాలు అందించేందుకు, సేవా, పారిశ్రామిక రంగాలు కోరుకుంటున్న నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, సంబంధిత శిక్షణలను ఉన్నత విద్యలో పొందుపరచాలని సూచించారు. అచ్చంపేటలోని ఎంఎస్ఎన్ పీజీ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌లో గ్రీన్ బెల్ట్‌కు నిర్దేశించిన భూములు ఆక్రమణకు గురైనట్లు ప్రిన్సిపాల్ చెప్పడంతో, దీనిపై సర్వే చేయించి తగు చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. జాతీయ రహదారి–216 విస్తరణకు సేకరించిన పీజీ సెంటర్ భూములకు పరిహారం చెల్లింపుపై ఆ శాఖ అధికారులను కోరతామన్నారు. గత ఏడాది ఇంటర్ ఉత్తీర్ణత జిల్లాలో 81 శాతం మాత్రమే ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంచి ఫలితాల సాధనలో ఏయే కళాశాలలు వెనుకబడుతున్నాయో విశ్లేషించేందుకు గడచిన ఐదేళ్ల ఫలితాలపై కళాశాలల వారీగా సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్య అధికారిని ఆదేశించారు. పిఠాపురం, ఏలేశ్వరం డిగ్రీ కళాశాలల భవనాల నిర్మాణానికి స్థలం అందుబాటులో ఉన్నందున నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల గేటు వద్ద ఈట్ స్ట్రీట్ నిర్వహణ వల్ల అసౌకర్యంగా ఉందని ప్రిన్సిపాల్ చెప్పగా, ఈ అంశంపై మున్సిపల్ అధికారులతో చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రత్యామ్నాయంగా జెడ్పీ కార్యాలయం వైపు ఉన్న గేటును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో పారిశ్రామిక అవసరాలకు అనుగుణమైన కోర్సులు నిర్వహించాలని, ఆయా అంశాల్లో ప్రావీణ్యం కలిగిన ఫ్యాకల్టీని నియమించాలని ఆదేశించారు. ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో కాలేజియేట్ విద్యాధికారి, పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం, ఇంటర్మీడియెట్ విద్యాధికారి జీజీకే నూకరాజు, సాంకేతిక విద్యాశాఖ ఓఎస్‌డీ డీఎస్‌వీఎస్ ప్రసాద్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సెగరెట్లు

- మార్కెట్‌లోకి నకిలీ సిగరెట్లు
- అమలాపురంలో భారీగా పట్టుబడ్డ సరకు
- చౌక ధరల మాటున పొంచి ఉన్న ప్రమాదం

అమలాపురం టౌన్: అసలు సిగరెట్లు కాల్చి పొగ తాగడమే ఆరోగ్యపరంగా నష్టం. దీనికి నకిలీ సిగరెట్లు తోడైతే ఆరోగ్యం ఎంతలా క్షీణిస్తుందో అంచనా వేయవచ్చు. గత నెల 24న అమలాపురంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పలు హోల్‌సేల్ దుకాణాలపై ఆకస్మికంగా నిర్వహించిన దాడుల్లో ఏకంగా రూ.17.44 లక్షల విలువైన అన్ బ్రాండెడ్ నకిలీ సిగరెట్ ప్యాకెట్లు 3,873 సీజ్ చేశారు. అమలాపురంలో పట్టుబడ్డ నకిలీ సిగరెట్ల మాదిరి జిల్లాలో మరెక్కడైనా నిల్వలు ఉన్నాయా? అన్న దిశగా విజిలెన్స్ అధికారులు తమ నిఘాను మరింత విస్తృతం చేశారు. జిల్లాలోని సిగరెట్ల పరంగా హోల్‌సేల్ వ్యాపారుల జాబితాను సేకరించి ఆ దిశగా సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. నిషేధిత అన్ బ్రాండెడ్ నకిలీ సిగరెట్లు అయిన హార్బర్ గోల్డ్, గోల్డ్ ఫిల్టర్, గోల్డ్ విమల్, వైట్ ఫ్లేక్, జారుమ్ బ్లాక్, పారిస్ వంటి పేర్లతో మార్కెట్‌లోకి దిగుమతి చేసి అక్రమ వ్యాపారాలకు తెర తీస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.



ఇటీవల అమలాపురంలోని ఓ హోల్‌సేల్ దుకాణంలో విజిలెన్స్‌కు పట్టుబడ్డ నకిలీ సిగరెట్ల ప్యాకెట్లు

విదేశాల నుంచి దిగుమతి...పన్నుల ఎగవేత

సాధారణంగా బ్రాండెడ్ సిగరెట్లను ఐటీసీ తదితర కంపెనీలు అధికారంగా హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా చేస్తూ ఉంటాయి. అయితే అన్ బ్రాండెడ్ సిగరెట్లు బంగ్లాదేశ్ తదితర విదేశాల నుంచి మన దేశానికి అక్రమంగా రవాణా అవుతున్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండా అతి చౌక ధరలతో ఆ నకిలీ సిగరెట్లను అక్రమంగా దిగుమతి చేసుకుంటున్నారు. ప్రభుత్వాలకు రావాల్సిన పన్నుల ఎగవేయడంతోపాటు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడేలా వాటి వినియోగం దుష్ప్రభావం చూపుతోంది. బ్రాండెడ్ కంపెనీల సిగరెట్ రూ.10 నుంచి రూ.15 వరకూ ధర ఉంటే అదే నకిలీ సిగరెట్ ధర రూ.2 నుంచి రూ.5 వరకూ ఉంటుంది. ఈ చౌక ధరల మాటునే ఆరోగ్యం నాశనం అవుతుంది. ఈ నిషేధిత సిగరెట్ల పొగ తాగితే ఆరోగ్యం తొందరగా క్షీణిస్తుందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన ఓ వ్యాపారికి గుంటూరుకు చెందిన ఓ వ్యాపారి నకిలీ సిగరెట్లు అమలాపురం పంపి దిగుమతి చేసినట్లు విజిలెన్స్ అధికారుల తమ విచారణలో గమనించారు. ఈ నకిలీ సిగరెట్ల స్టాక్‌కు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నప్పుడు ఆ వ్యాపారులు స్టాక్ కోసం ఖాతాల పుస్తకాలు, కొనుగోలు, అమ్మకాల బిల్లులు నిర్వహించడం లేదని జీఎస్టీ అధికారులు గుర్తించారు. జీఎస్టీ కింద నమోదు కాకుండా పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నట్లు గమనించారు. విజిలెన్స్ మాత్రమే కాకుండా రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ టాక్స్ అధికారులు సంయుక్తంగా అమలాపురంలో దాడులు నిర్వహించి నకిలీ సిగరెట్ల దందా గుట్టును రట్టు చేయడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. బాధ్యులపై విజిలెన్స్ శాఖ సీవోటీపీఏ యాక్ట్ కింద, లీగల్ మెట్రాలజీ శాఖ ఎల్ఎం యాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేశాయి.

నకిలీ సిగరెట్లతో ఆరోగ్యానికి మరింత ముప్పు



బ్రాండెడ్ సిగరెట్లు తాగితేనే ఆరోగ్యం ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులు దెబ్బతింటాయని వైద్యులు పదే పదే చెబుతూ ఉంటారు. అలాంటిది నకిలీ సిగరెట్లు తాగితే ఆ నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. పొగ తాగే వారి మానసిక పరిస్థితి కూడా ఆందోళనకంగా ఉంటుంది. నకిలీ సిగరెట్ల తాగితే మరింత తొందరగా అనార్యోగానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. బ్రాండెడ్ సిగరెట్ల వల్ల అనారోగ్య లక్షణాలు కాస్త ఆలస్యంగా సోకితే నకిలీ సిగరెట్ల వల్ల కొన్ని నెలల్లోనే ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. పొగ పీల్చడం అలవాటు నుంచి పూర్తిగా దూరమైతేనే ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది.

– డాక్టర్ సౌమ్య పసుపులేటి, మానసిక వైద్య నిపుణురాలు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం వద్ద 216(ఏ) నంబరు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రేలంగి సూర్యనారాయణ (60) మృతిచెందారు. ఆలమూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యనారాయణ జొన్నాడలో పూల వ్యాపారి. మధ్యాహ్న భోజనం చేసేందుకు సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. స్థానిక కాలిబాట వద్దకు వచ్చేసరికి రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న కారు వేగంగా వచ్చి సూర్యనారాయణను వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తమ కుటుంబానికి ఇక దిక్కెవరు అంటూ రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై శ్రీను నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక ఎస్సై శ్రీను నాయక్ నేతృత్వంలో పోలీసు, హైవే సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పెట్రోలింగ్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు మృతదేహం

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి ప్రాథమిక పాఠశాల వెనుక వైపు మదర్ థెరిస్సా విగ్రహం వద్ద రక్తం కక్కుకొని అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని గురువారం తెల్లవారుఝామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని మృతుని వివరాలు సేకరించారు. అనంతపల్లికి చెందిన తమిర్శి వెంకటేశ్వరావు(48)గా గుర్తించారు. మృతుడు స్థానిక సొసైటీ ఎరువుల గొడౌన్ వద్ద ఎరువుల బస్తాలు మోసే కూలీపనులు చేస్తుంటాడని సీఐ తెలిపారు. మృతునికి భార్య సావిత్రి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు నాగరాజు ఉన్నారు. ఆడపిల్లలకు పెళ్లిళ్లు కాగా వెంకటేశ్వరావు భార్యతో విభేదించి కుమారుడు నాగరాజుతో కలసి ఉంటున్నాడు. మృతుడు తరచు నాటుసారా తాగుతూ ఆహారం కూడ సరిగా తీసుకోడని, ఈ క్రమంలోనే బుధవారం అర్ధరాత్రి దాటాక నాటుసారా సేవించి వస్తుండగా రక్తపు వాంతులై స్పృహతప్పి పడిపోయి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి కేసుగా నమోదు చేశారు.

ప్రతిభ చూపితే.. భవిత మీదే..



- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- 6–11వ తరగతి విద్యార్థులకు అవకాశం
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్ షిప్
- సెప్టెంబర్ 15 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు తుది గడువు

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా విద్యార్థి విద్యాన్ మంథన్(వీవీఎం) పేరిట ఏటా ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 6,100 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉండగా ఈ పాఠశాలల్లో 7.5 లక్షల వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.



దరఖాస్తు విధానం ఇలా..

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది మే 19న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 15వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్, మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

జూనియర్, సీనియర్ విభాగాల్లో..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతులకు జూనియర్, 9–11 తరగతులకు సీనియర్ గ్రూపుగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

100 మార్కులకు పరీక్ష

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్ష అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉంటుంది. అయితే ఇందులో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు(గంటన్నర) పరీక్షను రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్–ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–బిలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజికల్, రీజనింగ్ 10 ప్రశ్నలుఉంటాయి.

రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారిలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6–11 తరగతులకు గాను మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3, 10, 17 తేదీల్లో ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతో పాటు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ఈ విధంగా..

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2023–24లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1–3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

హెచ్‌ఎంలు కృషి చేయాలి

ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు విజ్ఞాన్ మంథన్ పరీక్షలో పాల్గొనేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. రోజూ ఒక గంట కోచింగ్ ఇచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.



– జి.నాగమణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వీవీఎం.ఓఆర్‌ఎఫ్‌ఐ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వవచ్చు.



– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

ప్రతిభ నిరూపణకు చక్కని వేదిక

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తయారు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 20 నుంచి 30 వరకు విద్యార్థుల నమోదు ఉంటే ఆ పాఠశాలలకు పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారు.



– పీవీఎల్ఎస్ శ్రీరామ్, స్టేట్ కోఆర్డినేటర్, ఏపీ విద్యార్థి విజ్ఞాన్ మంథన్, అమలాపురం

మాజీ మంత్రి వేణుకు పరామర్శ

రామచంద్రపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను గురువారం పలువురు రామచంద్రపురంలో ఆయన ఇంటి వద్ద పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు సత్తి సూర్యనారాయణరెడ్డి, కొండేటి చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నల్లమిల్లి జనార్ధనరెడ్డి (చంటి రెడ్డి), పారిశ్రామికవేత్తలు చింతా బాబులురెడ్డి, సతీష్‌చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కాకినాడ ఏఎంసీ సత్తి గంగాదేవి, పార్టీ నాయకులు తొగరుమూర్తి, మల్లిడి సత్తిరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, రామచంద్రపురం, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ రూరల్ నియోజకవర్గాలకు చెందిన పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మాజీ మంత్రి వేణును పరామర్శించి, తల్లి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


మాజీ మంత్రి వేణు తల్లి సుభద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

వ్యక్తి దుర్మరణం


సురేష్ మృతదేహం

గోపాలపురం: స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని దొండపూడిలో గురువారం జరిగింది. ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం ఊట్లగూడెం గ్రామానికి చెందిన కారం సురేష్ కొంతకాలంగా వెంకటరెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం తన స్నేహితుడు కొమరం రాంప్రసాద్ మోటార్‌సైకిల్‌పై దొండపూడి కిషోర్ మార్కెట్ యార్డు వద్దకు వచ్చేసరికి స్కూల్ బస్సు ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న రాంప్రసాద్‌కు తీవ్రగాయాలు కాగా వెనుక కూర్చున్న కారం సురేష్ తలకు బలమైన గాయం కావడంతో అతనిని పోలవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో సురేష్(27) మృతిచెందినట్లు గురువారం ఎస్సై విలేకరులకు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇసుక దోపిడీదారుల ఆట కట్టు

మూతపడ్డ పులిదిండి ర్యాంపు

సాక్షి ఎఫెక్ట్

ఆత్రేయపురం: మండలంలోని పులిదిండిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలకు అధికారులు అడ్డుకట్ట వేశారు. అధికార పార్టీకి చెందిన నేత కొద్ది రోజులుగా దర్జాగా బాట వేసి యథేచ్ఛగా రాత్రి పగలు జేసీబీ యంత్రాలతో లోడింగ్ చేస్తూ వందలాది లారీల ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. దీన్ని 'తెలుగు తమ్ముళ్ల ఇసుక దోపిడీ' శీర్షికతో 'సాక్షి' గురువారం వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఉదయం ఆత్రేయపురం తహసీల్దారు వెంకటరామయ్య, ఆర్ఐ భవానీ సిబ్బందితో హుటాహుటిన ఇసుక ర్యాంపు వద్దకు చేరుకుని జేసీబీ సహాయంతో ర్యాంపు బాటను ధ్వంసం చేశారు. అధికారులు వస్తున్నారన్న సమాచారం నిర్వాహకులకు ముందుగా అందడంతో ర్యాంపు నుంచి జేసీబీలు, లారీలను తొలగించి పరారయ్యారు. అధికారులు రంగ ప్రవేశం చేయడంతో పులిదిండి ఇసుక ర్యాంపు మూతబడింది.


ఇసుక ర్యాంపు బాటను ధ్వంసం చేస్తున్న అధికారులు

2,800 లీటర్ల అక్రమ డీజిల్ పట్టివేత

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ చెక్‌పోస్టు వద్ద గురువారం నిర్వహించిన తనిఖీలలో 2,800 లీటర్ల అక్రమ డీజిల్‌ను రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసన్న తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి మండల పరిధిలోని మట్లపాలెంలోని చెరువులకు ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ ఎస్సై టి.జగన్నాథరెడ్డి, డీసీటీఓ ఎం.నవీన్‌కుమార్ దాడి చేసి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న డీజిల్‌తోపాటు అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి రెవెన్యూ, పోలీస్ అధికారులకు అప్పగించారు. అక్రమ డీజిల్ విలువ అంచనా కట్టి, అక్రమార్కులపై కేసు నమోదు చేయనున్నట్లు డీటీ లక్ష్మీ ప్రసన్న తెలిపారు.


అధికారులు సీజ్ చేసిన డీజిల్ వాహనం

గడువు ముగిసిన సాస్ సరఫరా చేసిన కేఎఫ్‌సీ రెస్టారెంట్

బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద ఎస్ఆర్ఎంటీ మాల్‌లో కేఎఫ్‌సీ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన రమ్య తన పిల్లలతో గురువారం కేఎఫ్‌సీకి వెళ్లి ఫుడ్ ఆర్డర్ చేయగా జూన్ నెలలో ఎక్స్‌పైర్ డేట్ ఉన్న సాస్‌ను అందించారు. దీనిపై ఆమె రెస్టారెంట్ నిర్వాహకులను ప్రశ్నించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి సుబ్బారావు కేఎఫ్‌సీ రెస్టారెంట్‌లో గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదును రుజువు చేసేలా సాస్ డిప్‌పై జూన్ 5 గడువు ఉండగా అది ఇచ్చినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

రామచంద్రపురం: భార్య కాపురానికి రావటం లేదని మనస్తాపం చెందిన ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని కొత్తూరు టిడ్కో గృహాల వద్ద బుధవారం చోటు చేసుకుంది. రామచంద్రపురం ఎస్సై కె. సురేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.గంగవరం మండలం దంగేరుకు చెందిన మెల్లిమి రాజు(30) కొంతకాలంగా తల్లి విజయలక్ష్మితో కలిసి కొత్తూరు టిడ్కో గృహాల వద్ద నివాసం ఉంటున్నాడు. భార్యతో గొడవల కారణంగా కొంతకాలంగా విడిగా ఉంటున్నాడు. తల్లి విజయలక్ష్మి ఈ నెల ఒకటో తేదీన పింఛన్ తీసుకునేందుకు దంగేరు వెళ్లింది. రెండో తేదీ రాత్రి 7 గంటల సమయంలో భార్య వచ్చి రాజుతో గొడవ పడింది. గురువారం తల్లి విజయలక్ష్మి వచ్చి చూసేసరికి తలుపు వేసి ఉంది. కిటికీ తెరచి చూస్తే దుర్వాసన రాగా స్థానికుల సహాయంతో తలుపులు తెరిచారు. అప్పటికే గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని రాజు మృతి చెంది ఉన్నాడు. తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

హెలిపోర్టు వినియోగంలోకి వచ్చేలా చర్యలు

కాకినాడ: కాకినాడ బీచ్‌రోడ్డులో రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన హెలిపోర్టు వినియోగంలోకి వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను కోరారు. గురువారం ఆయన బీచ్‌రోడ్డులో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన హెలిపోర్టును పరిశీలించారు. అక్కడ రెండు హెలిప్యాడ్‌లు, భవనంతోపాటు పలు సౌకర్యాలు కల్పించామని, ఈ హెలిపోర్టును ఏ విధంగా వినియోగంలోకి తీసుకురావాలనే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు.

గోదావరిలో దూకి ఆటోడ్రైవర్ మృతి


మృతుడు కిషోర్ బాబు (ఫైల్)

కొవ్వూరు: దేవరపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మెరిపో కిషోర్‌బాబు(33) గురువారం రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం రాత్రి కుటుంబ తగాదాల నేపథ్యంలో ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై బయల్దేరి బయటకు వచ్చారు. రోడ్డు కం రైలు వంతెనపై మోటారు సైకిల్, చెప్పులు విడిచిపెట్టి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు వెతకగా రోడ్డు కం రైలు వంతెనపై 138 స్తంభం వద్ద మోటారు సైకిల్, చెప్పులు లభ్యం కావడంతో నదిలో దూకినట్లు నిర్ధారించుకున్నారు. దీంతో జాలర్ల సాయంతో గాలించగా సాయంత్రం నదిలో మృతదేహం లభ్యమైంది. మృతుడు దేవరపల్లిలో ట్రక్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడికి సోదరుడు వరుసైన మెరిపో ఆదియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం కొవ్వూరు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

బంగారు వస్తువుల చోరీపై ఫిర్యాదు

ముమ్మిడివరం: ఇంటి బీరువాలో దాచుకున్న బంగారు వస్తువులను తన సమీప బంధువు దొంగిలించుకుపోయిందని ఒక మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముమ్మిడివరం బాలయోగి కాలువగట్టు రోడ్డులో ఉంటున్న జిత్తుక సుజని ఇంటికి రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన బంధువు సరెళ్ల తేజస్విని తరచూ వస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో మే 16న తమ ఇంటికి వచ్చిన తేజస్విని.. బీరువాలోని సుమారు రూ. 2.15 లక్షల విలువ చేసే బంగారు వస్తువులను దొంగిలించుకు పోయిందని ఫిర్యాదులో పేర్కొంది. ఆమె వెళ్లాక బీరువా తెరిచి ఉండటం గమనించి వస్తువులు చూసుకోగా లేకపోవడంతో బంధువుల సమక్షంలో పంచాయితీ పెట్టినా బంగారు వస్తువులు తిరిగి ఇవ్వ లేదని తెలిపింది. ఈ మేరకు ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారిపై తమ్మయ్యపేట శివారులో గురువారం రావికంపాడుకు చెందిన దంపతులు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో భార్య మృత్యువాత పడగా భర్త తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రావికంపాడు గ్రామానికి చెందిన ఎద్దు జగ్గయ్య తన భార్య లక్ష్మితో మోటార్‌సైకిల్‌పై కత్తిపూడిలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అదే మోటార్ సైకిల్‌పై రావికంపాడు బయలుదేరారు. తమ్మయ్యపేట శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ జంక్షన్ వద్ద రావికంపాడు వెళ్లేందుకు రహదారి క్రాస్ చేస్తుండగా వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీకొంది. దీంతో భార్య ఎద్దు లక్ష్మి(53) అక్కడికక్కడే మృతి చెందగా భర్త జగ్గయ్య తీవ్రగాయాలపాలవ్వడంతో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


లక్ష్మి మృతదేహం

రైస్‌మిల్లులో సివిల్ సప్లై అధికారుల తనిఖీలు

- 23 టన్నుల 330 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం
- రూ.10 లక్షలు విలువ ఉంటుందని అంచనా వేసిన అధికారులు

రంగంపేట: తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం పెద రాయవరం గ్రామం ఏడీబీ రోడ్డు పక్కన గల రామకృష్ణా రైస్ మిల్లులో సివిల్ సప్లై అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మిల్లులో ప్లాస్టిక్ సంచులలో భారీగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్టు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ ఎం.నాగరాజు మాట్లాడుతూ తనిఖీలో అక్రమంగా నిల్వ ఉంచిన 23 టన్నుల 330 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.10 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కి లారీలో తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ తనిఖీలలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ జి. బాపిరాజు, కె.సూర్య ప్రభాకర్, వీఆర్వో వీర్రాజు, వీఆర్ఏలు పాల్గొన్నారు.


పెదరాయవరం రామకృష్ణా రైస్‌మిల్లులో సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

వైభవంగా మరిడమ్మ జాతర ఆరంభం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ఉభయ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర గురువారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గరగల నత్యం, అమ్మవారి రథం, బ్యాండ్ మేళాలు, కోలాటం మధ్య అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. జాతర మహోత్సవాన్ని రాత్రి 8.40 నిమిషాలకు దేవదాయ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ ప్రారంభించారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీలు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ఘన స్వాగతం పలికారు. దేవదాయ శాఖాధికారులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి జాతరను ప్రారంభించారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారి గరగల నృత్యం, కోలాటం, పులి ఆట, సంబరాల్లోని పలు సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు. తొలుత పాత పెద్దాపురం (కోటముందు) పురాతన చరిత్ర కలిగి, మరిడమ్మ అమ్మవారు వెలసిన ఆలయంలో గరగను ఎత్తుకుని పాత పెద్దాపురంలో సంబరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తూతిక రాజు, కందుల విశ్వేశ్వరరావు, సక్కు, ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.


మరిడమ్మ ఆలయంలో ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న అధికారులు